# ఇది నా కథ

ఇది నా కథ, అంతా తమ కథనే చెప్పుకుంటూ ఉంటారు. నా కథ వినడానికి ఎవరూ ఉత్సహించక పోవచ్చును .కాని అన్ని కథలకూ అదే బాధ. వినే సహృదయులుండరు. అని చెప్పేవాళ్ళూ మానరు. నేనూ అంతే.

ప్రపంచంలో అందరూ సామాన్య మానవుని గురించి చెబుతూ ఉంటారు. నేను కూడా సామాన్య మానవుని కథే చెబుతాను.

నేను సామాన్య మానవుణ్ణి. నాలాంటి మానవులెందరినో నే నెరుగుదును. నన్ను గురించి చెబితే వారిని గురించి చెప్పినట్లే అవుతుంది.

నా కథలో కథలేదు. నా కథలో ఆనందంలేదు. విరసాన్ని సరసంచేసే రసం లేదు. విశ్వవిలసిత సౌందర్యభావం లేదు. త్రిజగన్మోహనమైన కల్పం లేదు. ఏలోకాంచలాలకో కొనిపోయి అననుభూత దివ్యానందానుభూతికై ఉర్రూతలూగించే ఊహావైచిత్ర్యం లేదు. అభూత కల్పనా ప్రౌఢమ లేదు. వాస్తవాన్ని మరొక దృక్పథంనుండి చూడనేర్పే అతివాస్తవిక ధోరణి లేదు. నా కథకొక ప్రారంభమూ లేదు, అంతమూ లేదు. నా కథలో ఉన్నది లేదు, లేనిది లేదు. నేను చెప్పని మహాగంభీరభావ మేదో నా కథలో స్ఫురించదు. నా కథ నవ్వించదు, ఏడిపించదు. నా కథ

నీతిని బోధించదు, అవినీతికి మార్గదర్శం కాదు. దేనినీ చెప్పదు. దేనినీ చెప్పకుండా ఉండదు. నా కథ లోకాతీత మైనదికాదు.

దీనికి కారణం నా జీవితమే.

నా జీవితంలో ఆనందం ఉందనీ, నా జీవితాని కొక ఆధారం ఉందనీ, నా జీవితానికి భూతభవిష్యద్వర్తమానా లున్నాయనీ అనుకున్నాను. చాలమంది అదే బోధించారు. ఇంకా చాలామంది వాటినే పుస్తకాలలో వ్రాశారు. అందు వల్ల అవన్నీ ఉన్నాయనే అనుకున్నాను.

"జీవితం ఆట వస్తువుకాదు. జీవితానికి చాల విలువ ఉంది. నీ జీవితం ఒక్కటే కాదు, ఇంకా ఎన్నికోట్ల జీవితాలతోనో కలసివున్నది. నీ వొక పరమాణువు. ఈ పరమాణువు ప్రపంచ పరమాణువులో ఒక పరమాణువు. నీ జీవిత మొక బిందువు. ఈ బిందువు శత సహస్ర యోజనీ పరిమాణం కలిగిన బిందువులో ఒక భాగం. ఈ బిందువు దేనినీ అంటదు. అన్నింటితోనూ అంటుకొనే ఉన్నది. నీవు నీవు కావు; నీవు నీవే. నీవు నీవుకాని నీవు.

"వాస్తవంగా నీ కొక జీవితం లేదు. అసలు నీకు జీవితమెందుకు?" అని మరికొందరు చెప్పారు. నాకు జీవితం లేదేమో ననుకున్నాను.

"నీ కొక ఆది, అంతమూ ఉన్నాయి. నీ జీవితం ఇదే. ఇంకేమీ లేదు. జీవించినంతకాలమే నీవు జీవిస్తావు. కనుక జీవించు. లేకపోతే జీవించవు" అని మరికొందరు చెప్పారు. దానితో నాకున్న భావాలన్నీ పోయాయి.

అందువల్ల జీవితం గురించి నా కేమీ తెలియలేదు. తెలుసుకోకుండానే ఉందా మనుకొన్నాను. కాని వీలులేక పోయింది. నా జీవితంతో సంబంధం లేనివారికి కూడా నన్ను గురించి కావలసి వచ్చింది. సంబంధమున్నవారు నన్ను బలవంతంగా నన్ను జీవితంలోనికి తీసుకొనివచ్చారు. అందు వల్ల నాకు జిజ్ఞాస తిరిగి ప్రారంభమయింది.

నేను మొదట జీవించడం ప్రారంభించేసరికి జీవించ డానికి నా కెన్నో ఆధారా లుండేవి. కాని ఇప్పు డవి లేవు. నే నెలా జీవించాలి? నే నెలా జీవించకూడదు? నే నసలు జీవించాలా? నేను జీవించడ మెందుకు? అని ఆలోచిం చాను. సమాధానాలు దొరకలేదు.

ఇప్పుడు నన్ను గురించి నా కేమీ తెలియదు. నాకు జీవితం ఉందని తెలియదు. నాకు జీవితం లేదేమో నాకు తెలియదు.

అందువల్ల నేను జీవించలేకపోయాను. కాని నేను జీవించేవున్నాను.

ఈ కాలంలో నాకు తెలియవచ్చిన విషయమొక్కటే- నేను లేకుండా లేను. నేను ఉన్నాను.

మరొక విషయం కూడా నాకు తెలిసింది. నాతో పాటు యింకా చాలమందీ ఉన్నారు.

వారికి గతమనేది ఉందో లేదో, వారికి వర్తమానం ఉందో లేదో, వారికి భవిష్యత్తు ఉందో లేదో నాకు తెలియదు.

నన్ను గురించి నాకు తెలిసిన విషయంలాగే, వారిని గురించి నాకు తెలిసిన విషయంకూడా ఒక్కటే - వారూ ఉన్నారు.

ఇంత అత్యంత ప్రధానమైన విషయం సామాన్యంగా ఉన్న సామాన్య మానవులం మేము. కనుకనే ఒకరితో ఒకరు కలసి జీవించ గలుగుతున్నాము; జీవిస్తాము.

నా కొకటే ఆవేదన.

ఏ రసం, ఏ శిల్పం, ఏ కల్పన, ఏ సౌందర్యం, ఏ ఆనందం ప్రస్తుతం నా జీవితంలో లేవో వా టన్నిటితో నా జీవితం సర్వసంపూర్ణం అయ్యేలా చూస్తాను.

ఇదే స్థితి నా తోడి సామాన్యమానవు లందరికి కలిగేలా జీవిస్తాను. ఇదే వాస్తవమైన నా జీవితం.

ఈ ఆవేదన అనంతం, అనంతమైన యీ ఆవేదనకు నా జీవిత మొక నివాళి.

ఇంతకన్న నేను చెప్పేది లేదు.

ఇది నా కథ అని ముందు చెప్పాను. ఇది నా కథ కాదు. అయినా ఇది నా కథే. ఇది మీ కథ మాత్రం కాదు. మీకథ నాకథ కాదు. నేను చెప్పేది నాకథే. మీ కథకాదు. అందువల్ల ఇది నా కథే.

నా కథ ఇదే. ఇంతకన్న నాకు కథ లేదు.